క్లుప్తంగా

దుర్గాలమ్మకు విశేష పూజలు



విశేష అలంకరణలో చంద్రంపాలెం దుర్గాలమ్మ

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పట్నాల మూర్తి శర్మ ఆధ్వర్యంలో నిత్యపూజలు, కుంకుమార్చన, పుష్పార్చన చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. మధురవాడకు చెందిన సాగిశివనాథరాజు, లక్ష్మీదీప్తి కుటుంబ సభ్యుల సహకారంతో అమ్మవారికి ప్రసాదం నివేదించారు. పీఎం పాలెం పద్మశాలీ ఆత్మీయ సేవాసంఘం ఆధ్వర్యంలో అర్జి పవన్ కుమార్, శిరీష మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు పిల్లా సూరిబాబు, ఉపాధ్యక్షుడు పీవీజీ అప్పారావు, కార్యదర్శి నాగోతి తాతారావు కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం 11 కేవీ గంభీరం ఫీడర్‌లైన్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ, మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా దుక్కవానిపాలెం, మెట్టమీదవాని పాలెం, ఈగలవానిపాలెం, పాలవలస, గుడిలోవ, ప్రకృతివానిపాలెం, తర్లువాడ, నగరపాలెం తదితర గ్రామాల గృహ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కుక్కల దాడిలో మేక హతం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలసలో శుక్రవారం వీధి కుక్కలు మేకపై దాడి చేసి, చీల్చి చెండాడాయి. దీంతో సంఘటనా స్థలంలో మేక అవయవాలు బయటకు వచ్చి భయానకంగా కనిపించింది. కుక్కలను స్థానిక ప్రభుత్వాలు నియంత్రించక పోవడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని మేక యజమాని లొడగల చిన్నోడు వాపోయాడు. దీని విలువ రూ.12వేలు ఉంటుందని తెలిపారు. జీవీఎంసీ సిబ్బంది స్పందించి, కుక్కలను నియంత్రించాలని కోరారు.

'రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడుతున్న కూటమి ప్రభుత్వం'

తగరపువలస: కూటమి ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. చిట్టివలసలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 11 నెలల పాలనాకాలంలో చేసిన 1.40 లక్షల కోట్ల రుణాలు ఎటు వైపు వెళ్లిపోయాయో సీఎం చంద్రబాబు చెప్పాలన్నారు. అప్పుల కోసం రాజ్యాంగాన్ని ఉల్లంఘించి ఏకంగా 436 గనులు ఏపీఎండీసీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. రూ.1.91 లక్షల కోట్ల విలువైన గనులు తాకట్టు పెట్టి రూ.9వేల కోట్లు రుణం తీసుకోవడానికి అడుగులు వేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని వినాశకర పరిస్థితుల్లోకి నెట్టివేసి, భవిష్యత్తును అంధకారం చేస్తామంటే వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



ఎండాడలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కొమ్మాది: అందరిలోనూ మార్పు వస్తే మలేరియాను అంతం చేయవచ్చని హెల్త్ అసిస్టెంట్ ఆఫీసర్ శేఖర్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఎండాడలో శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే మలేరియా వంటి వ్యాధులకు చెక్ పెట్టవచ్చని చెప్పారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

222 మెట్రో బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి

తగరపువలస: తగరపువలస నుంచి విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు నడిపే 222 మెట్రో బస్సు సర్వీస్‌లను పునరుద్ధరించాలని ఉద్యోగులు, ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు. తగరపువలస నుంచి రోజూ ఉదయం 6.30 నుంచి 7.30 గంటల మధ్య సుమారు 300 మంది ఈ బస్సుల్లో విశాఖ వెళ్తుంటారన్నారు. ఇటీవల మెట్రో బస్సు సర్వీసులు తొలగించి, కేవలం 222 ఆర్డినరీ బస్సులు మాత్రమే నడుపుతున్నారని తెలిపారు. దీనిపై మద్దిలపాలెం డిపోలో ఫిర్యాదు చేసినా, ఆర్టీసీ అధికారులు స్పందించలేదన్నారు. 222 మెట్రో బస్సు సర్వీసుల పునరుద్ధరణతో పాటు అదనపు బస్సులు ప్రవేశపెట్టాలని కోరారు.

ఏదీ నాటి వైభవం?

నాడు

పర్యాటక స్వర్గధామం విశాఖ. సందర్శకులకు బీచ్‌రోడ్డులో ప్రయాణం ఓ మధురానుభూతి. ఆ అనుభూతిని పదిలపరిచేలా గత ప్రభుత్వం భీమిలి బీచ్ రోడ్డు సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించడంతో శోభాయమానంగా దర్శనమిచ్చేది. విద్యుత్ దీపాలంకరణలతో.. పరవశింపజేసే పచ్చదనంతో, విభిన్న ఆకృతుల నిర్మాణాలతో అతిథులకు స్వాగతం పలికేది. అందుకే అటువైపు ప్రయాణమంటే ప్రతి ఒక్కరూ ఇష్టపడేవారు.

నేడు

ప్రభుత్వం మారిన తరువాత బీచ్ రోడ్డును అభివృద్ధి చేయడం మాట దేవుడెరుగు.. చేసిన అభివృద్ధిని కాపాడుకోలేని పరిస్థితి కనిపిస్తోంది. లైట్లు వెలగక బీచ్ రోడ్డులో అంధకారం అలముకుంది. ఫుట్‌పాత్‌లు, బెంచీలు ధ్వంసమయ్యాయి. ట్రీవాల్స్‌లో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా తయారయ్యాయి.

- కళావిహీనంగా భీమిలి బీచ్ రోడ్డు
- నిర్వహణ లేక ఎండిపోతున్న మొక్కలు
- ధ్వంసమైన బెంచీలు, ఫుట్‌పాత్‌లు
- అలముకున్న అంధకారం



నాడు సుందరంగా సాగర్‌నగర్ బీచ్



నేడు తిమ్మాపురం వద్ద అలముకున్న చీకటి



ధ్వంసమైన ఫుట్‌పాత్



మూలకు చేరిన ఫౌంటైన్

కొమ్మాది: సాగర్‌నగర్ బీచ్‌రోడ్డు కళ తప్పింది. గతంలో హైమాస్ట్ లైట్లు, కల్వర్టుల వద్ద ట్రీవాల్స్, నేమ్ బోర్డులు, అందంగా ఫుట్‌పాత్‌లు, పెయింటింగ్స్, రోడ్డుకు ఇరువైపులా పచ్చని మొక్కలతో కళకళలాడే భీమిలి బీచ్‌రోడ్డు ఇప్పుడు కళావిహీనంగా దర్శనమిస్తోంది.

ఇంతలో ఎంత మార్పు?

గుడ్లవానిపాలెం బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు గత ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టింది. గుడ్లవానిపాలెం వద్ద బీచ్ పార్క్ అభివృద్ధి, సాగర్‌నగర్ కల్వర్టు, రుషికొండ ఐటీ జంక్షన్ కల్వర్టుల వద్ద ప్రాంతాలను తెలియజేసే బోర్డులతో పాటు ట్రీవాల్స్ నిర్మించారు. ఇక్కడ కల్వర్టుల వద్ద దిగువ నుండి ప్రవహించే మురుగు నీరు కనిపించకుండా, దుర్వాసన రాకుండా పచ్చదనం కనువిందు చేసేలా ఆహ్లాదకర రీతిలో పలు జాతుల మొక్కలను ఈ ట్రీవాల్స్‌లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ట్రీవాల్స్‌లో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా తయారయ్యాయి. అంతే కాదు ఫుట్‌పాత్‌లు, బెంచీలు చాలా ప్రాంతాల్లో ధ్వంసమయ్యాయి. బీచ్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ పరిస్థితి అడగనవసరం లేదు. కొన్ని చోట్ల లైట్లు మాయమైపోయి, మరి కొన్ని చోట్ల వెలగలేని పరిస్థితుల్లో ఉన్నాయి. రుషికొండ నుంచి తిమ్మాపురం వరకు సెంట్రల్ లైటింగ్ వెలగక నిత్యం ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఎండాడ వద్ద ఏర్పాటు చేసిన ఫౌంటైన్ నిర్వహణ లేక వెలవెలబోతోంది. రోడ్డు మధ్య భాగంలో డివైడర్లపై ఏర్పాటు చేసిన మొక్కల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అడుగడుగునా ఎండిపోయిన మొక్కలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఇటుగా వెళ్తున్న ప్రయాణికులు నాడు ఎలా ఉండేదో, నేడు ఎలా ఉందో తలచుకుని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చీకటి అయితే భయం



గతంలో బీచ్‌రోడ్డులో రాత్రి ఏ సమయానికి వెళ్లినా భయం ఉండేదికాదు. కానీ ఇప్పుడు సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదు. దీంతో ఇటుగా ప్రయాణించాలంటేనే ఆందోళనగా ఉంటోంది. బీచ్ రోడ్డు వెంబడి ఉన్న మొక్కలు, చెట్లు కూడా ఎండిపోతున్నాయి. బీచ్‌రోడ్డు అభివృద్ధిపై ప్రభుత్వం శ్రద్ధ వహించాలి.

– చెన్నా ఎల్లయ్య, రుషికొండ

ఎక్కడ చూసినా కళావిహీన దృశ్యాలే..



బీచ్ రోడ్డులో ప్రయాణిస్తుంటే అప్పట్లో మనసుకు ఆహ్లాదకరంగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనపడటం లేదు. భీమిలి నుంచి విశాఖపట్నం వరకు రోడ్డు వెంబడి అంతా కళావిహీనంగా ఉంది. ఎండిపోయిన చెట్లు, వాడిపోయిన మొక్కలు, వెలిసిపోయిన రంగులు, వెలగని లైట్లు, పాడైన ఫుట్‌పాత్‌లు కనిపిస్తున్నాయి.

– శివ, మంగమారిపేట

నిర్వహణను గాలికి వదిలేశారు



బీచ్ రోడ్డుకు గతంలో ఉండే శోభ ఇప్పుడు లేదు. అధికారుల నిర్లక్ష్యంతో నిర్వహణను గాలికి వదిలేశారు. ఎక్కడ చూసినా కళావిహీనంగానే కనిపిస్తుంది. ఇదే కొనసాగితే పర్యాటకులు ఇటుగా ప్రయాణించడానికి కూడా ఇష్టపడరు.. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలి. బీచ్ రోడ్డును అభివృద్ధి చేయాలి.

– దువ్వి వాసు, ఎండాడ

పహల్గాం మృతులకు నివాళులు



అంబేడ్కర్ కూడలిలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: పహల్గాం మృతులకు వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. అంబేడ్కర్ కూడలి వద్ద శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో అంజలి ఘటించారు. ఉగ్రవాదుల ఘాతుకంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, భాగం సుధాకర్, అక్కరమాని చినబాబు, సిమ్మల ప్రసన్న, జి.సృజన, కొయ్య రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–2 పరిధి 5, 6, 7, 8 వార్డుల పరిధిలో గల పలు ప్రాంతాలకు తాగునీటి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోన్–2 పరిధి 5, 6, 7, 8 వార్డుల పరిధిలో తాగునీటిని సరఫరా చేసే ప్రధాన వనరు గోస్తనీ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద తాగునీటిని పంపింగ్ చేసే ప్రధాన పైప్ లైన్ పంప్ హౌస్ వద్ద, మారికవలస మెట్రో హోల్ సేల్ ఎదురుగా లీకులకు గురి కావడం వల్ల మరమ్మతుల కారణంగా శనివారం నీటి పంపింగ్ జరగదని తెలిపారు. 5వ వార్డు బోరవానిపాలెం, సాయిరాంకాలనీ, 6వ వార్డు కొమ్మాది విలేజ్, ఎంఎస్ఆర్ లే అవుట్, సాయి ప్రియ లే అవుట్, సంపత్ నగర్, లక్ష్మీవానిపాలెం, ఎస్సీ కాలనీ, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, పీఎం పాలెం, అశోక్‌నగర్, తులసీనగర్, 7వ వార్డు పరిధి చంద్రంపాలెం, కళానగర్, కృష్ణానగర్, ఎన్‌జీవోస్ కాలనీ, 8వ వార్డు పరిధి మిథిలాపురి వుడా కాలనీ, పాత మధురవాడ, ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ, షిప్‌యార్డ్ లే అవుట్, బింద్రానగర్, తారకరామనగర్, చాణిక్యపురి లే అవుట్, పియర్‌లెస్ కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయడం ఏర్పడనుందన్నారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

అసిస్టెంట్ కమాండెంట్ కార్యాలయ చాంబర్ ప్రారంభం



చాంబర్‌ను ప్రారంభిస్తున్న 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డులోని బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ పోలీస్ బెటాలియన్‌లో ఇటీవల పునర్నిర్మించిన అసిస్టెంట్ కమాండెంట్ కార్యాలయం చాంబర్‌ను బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ సీహెచ్ వీఎస్ పద్మనాభరాజు, అడిషనల్ కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్లు పి.సత్యం, జి.ఇలియా సాగర్, వి.నారాయణ, బి.రామకృష్ణ, ఆర్ఐలు ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

కేకే రాజుకు అభినందనలు



కేకే రాజుకు జ్ఞాపిక బహూకరిస్తున్న సాంస్కృతిక విభాగం నాయకులు

మధురవాడ: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కేకే రాజును పలువురు నాయకులు శుక్రవారం విశాఖలో కలిశారు. పార్టీ విశాఖ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు వంకాయల మారుతీప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి ఎం. మల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల నాయకులు బెల్లాపు పాపారావు, పీవీజీ అప్పారావు, పెంద్ర అప్పన్న తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

- సంగివలసకు చెందిన పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అక్కరమాని మంగరాజు తదితరులు కేకే రాజుకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

బోరు పునరుద్ధరణ



మరమ్మతుల అనంతరం బోరు నుంచి నీరు వస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పీఎం పాలెం: జీవీఎంసీ ఏడో వార్డు పరిధి జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలోని బోరును సిబ్బంది పునరుద్ధరించారు. ఇక్కడ బోరు పాడవడంతో కొన్ని నెలలుగా నిరుపయోగంగా ఉంది. దీంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 'మూలకు చేరిన బోరు' శీర్షికతో ఈ నెల 23న సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం వెంటనే స్పందించింది. అవసరమైన మరమ్మతులు చేయడంతో బోరు బాగుపడింది. నీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



శిబిరంలో పాల్గొన్న పిల్లలు

భీమునిపట్నం: భీమిలిలోని కళాసాహితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాసాహితి అధ్యక్షుడు పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ మాట్లాడుతూ పిల్లలకు పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి విలువలు, ప్రవర్తన గురించి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన ప్రవచనకర్త రామకృష్ణానంద మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లలకు చదువుతోపాటు నైతిక విలువలు ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ వాటిని తప్పకుండా పాటించాలన్నారు. సీఐ తిరుమలరావు మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలు పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పద్యకవి బులుసు వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు రేలంగి పెదబాబు, పోలిపల్లి శ్రీనివాసరావు, పిట్టా సురేష్, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఎచ్చర్ల హరి, చంద్రావతి, నిర్మల పాల్గొన్నారు.

కార్మికుల 10డీ దరఖాస్తుల ఆన్‌లైన్‌కు వినతి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో సుమారు 300 నుంచి 350 మంది కార్మికుల 10డీ దరఖాస్తులను యాజమాన్యం ఐదేళ్లుగా ఆన్‌లైన్ చేయని కారణంగా పెన్షన్లు రాక ఇబ్బంది పడుతున్నారని చిట్టివలస ప్రాంత ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ మర్రిపాలెంలోని ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయంలో కమిషనర్ అవినాష్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు మాట్లాడుతూ గతంలో మిల్లు యాజమాన్యం ఈ దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో చేసేదన్నారు. తరువాత ఆన్‌లైన్ చేయాలని పీఎఫ్ కార్యాలయం నుంచి యాజమాన్యానికి ఆదేశాలు జారీ అయినా స్పందించలేదన్నారు. దీనిపై నెలరోజుల క్రితం సంఘం నుంచి యాజమాన్యానికి వినతిపత్రం అందించామన్నారు. ఇప్పటికైనా కార్మికుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని కోరామన్నారు. ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ గడువు పెంచాలి

తగరపువలస: డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు 90 రోజులకు గడువు పెంచి, కొన్ని వెసులుబాట్లు కల్పించాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు. గతంలో అభ్యర్థులు లోకల్, నాన్‌లోకల్ పరిధిలో దరఖాస్తు చేసుకునేవారని, ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా అయితే లోకల్ లేదా నాన్‌లోకల్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవలసి వస్తోందని తెలిపారు. గతంలో మాదిరిగా రెండు చోట్లా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. దరఖాస్తు గడువు మే 15తో ముగుస్తున్నందున, దీనిని పెంచాలని అభ్యర్థిస్తున్నారు. ధ్రువపత్రాలు తీసుకోవడానికే 10 నుంచి 15 రోజుల సమయం పడుతుందన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో సమస్యలు తలెత్తుతున్నాయని, ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. అకస్మాత్తుగా నోటిఫికేషన్ ఇచ్చి, తక్కువ సమయం ఇవ్వడంతో అభ్యర్థులు ఒత్తిడికి లోనవుతున్నారని, గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

జోన్–2 కార్యాలయంలో విద్యుత్ వృథా



కార్యాలయంలో ఎవరూ లేకుండానే ఆన్‌చేసి ఉన్న ఫ్యాన్లు, లైట్లు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2 కార్యాలయంలో విద్యుత్ వృథా అవుతోంది. రెవెన్యూ సెక్షన్‌లో అధికారులు సీట్లలో లేకుండానే ఫ్యాన్లు, లైట్లు, ఏసీలు ఆన్ చేసి, వదిలేస్తున్నారు. నిత్యం ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఒకవైపు విద్యుత్ మీటర్లు గిర్రున తిరిగి ప్రజలకు వేలల్లో కరెంట్ బిల్ వస్తోంటే, మరోవైపు ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్‌ను వృథా చేయడం సరికాదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఇంధన పొదుపు పాటిస్తే ప్రజాధనం వృథా అవకుండా ఉంటుందంటున్నారు.

ఆలయాలను సందర్శించిన దేవదాయశాఖ అధికారులు

తగరపువలస: దేవదాయశాఖ అధికారులు శుక్రవారం ఆనందపురం మండలంలోని పలు ఆలయాలను సందర్శించారు. అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, అర్చక సంఘం ప్రతినిధులు శ్రీనివాస దీక్షితులు, మురళీకృష్ణ, ఈవో శ్రీనివాసరావు, మండలానికి చెందిన అర్చకులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. దేవాలయాలలో ధూపదీప నైవేద్యాల ఖర్చులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించడానికి వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ధూపదీప నైవేద్యాలు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పాలవలస, పొడుగుపాలెం రామాలయాలు, శివాలయాలను సందర్శించి వాటి చరిత్ర గురించి తెలుసుకున్నారు. టూరిజం వెబ్‌సైట్‌లో ఈ దేవాలయాలను చేర్చి, వాటి అభివృద్ధికి కృషి చేయనున్నట్టు తెలిపారు.



బాపూజీ నగర్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణం

మధురవాడ: కూటమి నాయకులే కాదు, వారి అనుచరులు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులపై ఒత్తిడి తీసుకువస్తూ చేస్తున్న ఆగడాలకు హద్దూఅదుపూ లేకుండా పోతోంది. అందుకు ప్రత్యక్ష నిదర్శనం బాపూజీ నగర్‌లో చేపడుతున్న ఈ నిర్మాణమే.

జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ బాపూజీ నగర్‌లో ఓ వ్యక్తి పక్క నియోజకవర్గ ఎమ్మెల్యే మనిషిని అని చెబుతూ, కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారం భవన నిర్మాణం చేపడుతున్నాడు. పీహెచ్‌సీ రోడ్డులోని బాపూజీ నగర్‌లో ఓ వ్యక్తి సోషల్ వెల్ఫేర్ వీకర్ సెక్షన్ కాలనీలో 66గజాలకు పట్టా పొందాడు. కానీ, ఇక్కడ 120 గజాల స్థలంలో దర్జాగా నిర్మాణం చేస్తున్నాడు. సెట్ బ్యాక్స్, ఇతర నిబంధనలు మాట దేవుడెరుగు రెండు వైపులా ఉన్న కాల్వలు కూడా వదలకుండా మెట్లు నిర్మించేస్తున్నాడు. ఎక్కడైనా సామాన్యులు, సిఫార్సులు లేనివారు చిన్నపాటి ఉల్లంఘనకు పాల్పడినా ఆగమేఘాల మీద సీసీపీ స్థాయి అధికారులు వచ్చి మరీ చర్యలు చేపడతారు. కానీ ఇక్కడ ఇష్టానుసారం నిర్మాణం చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లే వ్యవహరిస్తున్నారు.

పట్టాను మించి క్రమబద్ధీకరణ డాక్యుమెంట్

మరో విచిత్రం ఏమిటంటే ఈ వ్యక్తి పట్టాలో 66గజాల భూమి ఉంటే, క్రమబద్ధీకరణ సందర్భంగా పొందిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌లో అంతకంటే ఎక్కువ స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనేది మరో ఆరోపణ. ఇదెలా సాధ్యమైందో అధికారులే సెలవివ్వాలి. మధురవాడలో ఎక్కడ చూసినా ఇలాంటివి కోకొల్లలు.. అయినా ఉన్నతాధికారులు పట్టించుకోరు. ప్లాన్‌కు దరఖాస్తు చేసుకోకుండానే నిర్మాణ పనులు పిల్లర్స్ వరకు వచ్చేశాయంటే పరిస్థితి వేరే చెప్పాల్సిన అవసరం లేదు. పైగా జీవీఎంసీ కాల్వకు కనీసం అర అడుగు కూడా వదలకుండా బోరు కూడా వేశారు. ఇక ఇతర అనుమతులు, నిబంధనల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది.

పనులు ఆపమన్నా ఆపడం లేదు

ఇక్కడ పట్టాలో ఉన్నదాని కంటే ఎక్కువ స్థలంలో నిర్మాణం చేపడుతున్నారని, ప్లాన్ కూడా లేని కారణంగా పనులు ఆపమని చెప్పాను. పని స్టార్ట్ అయ్యి 2 నెలలైంది. అప్పటి నుంచీ పని ఆపమని చెపుతున్నా ఆపడంలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, నోటీసు ఇస్తాం.

– లక్ష్మణనాయుడు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ